
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

మంగళవారం 12 ఆగస్టు 2025



ఇంటర్‌లో హాజరుకు ఫేస్ రికగ్నిషన్

- ఈ యేడాది నుంచే ప్రవేశపెట్టే యోచన
- విద్యా నాణ్యత పెంపొందించే దిశగా చర్యలు
- జగిత్యాల జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు



జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు విషయంలో ఫేస్ రికగ్నిషన్ విధానం అమలు చేస్తోంది. ఇక జూనియర్ కళాశాలల్లోనూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఫేస్ రికగ్నిషన్ హాజరు అమలుకు కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇంటర్ విద్యలో ఈ సంస్కరణలు విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి దోహదపడనున్నాయి.

● ఆధునిక సాంకేతికతతో హాజరు..

ప్రస్తుతం జూనియర్ కళాశాల్లో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల హాజరును బయోమెట్రిక్‌విధానం ద్వారా నమోదు చేస్తున్నారు. అయితే సుమారు మూడు వారాలుగా కేంద్ర ప్రభుత్వ యుడాయి సంస్థతో ఒప్పందం ముగియడంతో నెట్‌వర్క్ సమస్యలు, బ్యాటరీ లోపాలు వంటి సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనిని అధిగమించేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సాంకేతికత (ఎఫ్ఆర్ఏఎస్)ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ వ్యవస్థ హాజరు నమోదులో కచ్చితత్వాన్ని, సమయపాలనను నిర్ధారిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

● సీసీ కెమెరాలతో పర్యవేక్షణ..

జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో సుమారు 5,500 పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. కళాశాలల్లో సుమారు 240 అధ్యాపకులు బోధన విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు సుమారు 80మంది బోధనేతర సిబ్బంది వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే కళాశాలల్లో మౌళిక సదుపాయాల కోసం రూ.6కోట్లు మంజూరు అయ్యాయి. ప్రతీ క్లాస్‌రూమ్, ల్యాబ్, ప్రిన్సిపాల్ గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కెమెరాలు నాంపల్లి లోని ఇంటర్మీడియట్ బోర్డు కమాండ్ కంట్రోలు సెంటర్‌తో అనుసంధానించబడ్డాయి. దీంతో హైద్రాబాద్ నుంచి అధికారులు తరగతులు, బోధనా పద్ధతులు, సమయపాలనను పర్యవేక్షిస్తున్నారు. ఇంట రాక్టివ్ సీసీ కెమెరాలు లోపాలను సవరించుకోవడానికి, బోధన నాణ్యతను మెరుగుపరచడానికి సహాయ పడుతున్నాయి.

● బయోమెట్రిక్‌లో సాంకేతిక సమస్య..

గతంలో అమలు చేసిన బయోమెట్రిక్ విధానంలో నెట్‌వర్క్ సమస్యలు, సిమ్ లేదా బ్యాటరీ లోపాలు వంటి సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యలను అదిగమించేందుకు ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సాంకేతికత అమలు చేయడం

- మిగతా 8లో

నలుగురు తహసీల్దార్ల బదిలీ

జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ సోమవారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్‌ను ధర్మపురి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నాయబ్ తహసీల్దార్ అరుణ్ కుమార్ ఫుల్ అడిషనల్ చార్జి అప్పగించారు. బుగ్గారం తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ మజీదును గొల్లపల్లికి బదిలీ చేశారు. గొల్లపల్లి తహసీల్దార్ వరందన్‌ను కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. జగిత్యాల అర్బన్ నాయబ్ తహసీల్దార్ తిరుపతిని బుగ్గారం ఫుల్ అడిషనల్ చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధానకార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది అర్జిదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేసే దిశగా పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని వివరించారు.

'యాదవులు రాజకీయాల్లో రాణించాలి'

కథలాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యాదవులు రాజకీయాల్లో రాణించాలని జిల్లా యాదవ సంఘం అడహక్ కమిటీ అధ్యక్షుడు గనవేని మల్లేశ్ అన్నారు. రాజకీయ చైతన్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కథలాపూర్ మండలంలోని పోసానిపేటలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. సంఘాలు బలోపేతం కావడంతో పాటు యాదవుల హక్కుల సాధన కోసం పాటు పడాలని అన్నారు. అనంతరం గ్రామంలో 26 మందికి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ బొడ్డు బాలు, జెల్ల వేణు, అరికంటి సాగర్ తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి 40 దరఖాస్తులు



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 40 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రజావాణి సందర్భంగా వచ్చిన అర్జీలను శాఖల వారీగా పరిశీలన జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్డీవో రఘువరణ్, ఆర్డీవోలు మధుసూదన్, జివాకర్‌రెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి

జగిత్యాల క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియమ నిబంధనలను పకడ్బందీగా అమలు చేసేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆదేశించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం డీఎస్పీ తనిఖీ చేశారు. సిబ్బంది తమ విధులను అంకిత భావంతో నిర్వహించాలని డీఎస్పీ పేర్కొన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించారు. స్టేషన్ ఆవరణతో పాటు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఐ కరుణాకర్, ఎస్సై మల్లేశం తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొడిమ్యాల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలం నాచుపల్లిలో సింగిల్‌విండో చైర్మన్ రాజనర్సింగరావు తల్లి ప్రేమలత ఇటీవల మృతిచెందగా సోమవారం బాధిత కుటుంబాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. మృతురాలి చిత్ర పటానికి మంత్రి, ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులు అర్పించారు. మంత్రి వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు నారాయణగౌడ్, ముత్యం శంకర్‌గౌడ్, స్వామి, గంగన్న, శంకర్‌గౌడ్, అంజయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

'యూరియా కొరత తీర్చాలి'

కథలాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నందున వెంటనే యూరియా కొరత తీర్చాలని రైతు ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు బద్దం మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమ వారం కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం మొక్కజొన్న పీచు, జల్లు దశలో ఉందని యూరియా వేయాల్సి ఉంటుందని అన్నారు. యూరియా చల్లకపోతే పంట దిగుబడులు సగానికి పడిపోతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం శేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బద్దం మహిపాల్ ఉన్నారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

●పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం ●మంత్రి లక్ష్మణ్‌కుమార్



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణకు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనేక వ్యాదులను దూరం చేసుకోవచ్చని ఆయన అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకుని ధర్మపురి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ (బాలికల) ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంత్రి అధికారులతో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ నులి పురుగులు వల్ల వ్యాపించే వ్యాధుల నివారణలో పరిశుభ్రత కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో, పాఠశాలల్లోను పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించు కోవాలని ఆయన కోరారు. సకాలంలో టీకాలు వేయించుకోవాలని ఆయన తెలిపారు. ఆరోగ్యంతో పాటు విద్యార్థుల మానసికాభివృద్ధికి పరిశుభ్రత అవసరమని ఆయన అన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యలో మెరుగైన ఫలితాలు సాధించగలరని ఆయన అన్నారు. నేరెళ్ల పీహెచ్‌సీ పరిధిలో 19 సంవత్సరాల లోపుగా ఉన్న 19,157 మంది విద్యార్థులు, యువకులు, పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో 18,259 మందికి అల్బెండజోల్ మాత్రలు సాయంత్రం వరకు వేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నీలారపు శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, ధర్మపురి పీఏసీఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సీడీపీవో వాణిశ్రీ, వైద్యాధికారి డాక్టర్ శివకుమారి, హెచ్‌ఎం కొలిచాల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి

ఎన్నికల్లో జరిగిన అవకతవకలు గురించి, ఆరోపణలు వస్తే వాటిపై బాధ్యత గల కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపి అవి సరికాదని నిర్ధారణ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమీషన్ అనేది కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో పని చేస్తుందని ఆయన తెలిపారు. గత 2014 ముందు ఎన్నికల కమీషన్ అనేది స్వంతంగా పని చేసిందని ఆయన అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నికల కమీషన్ అనేది మోదీ కంట్రోల్‌లోకి వెళ్లిపోయిందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో జరిగిన ఎన్నికల సంబంధించిన అవకతవకలపై ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలను సుమోటోగా తీసుకుని విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

శివాలయాల్లో శ్రావణ మాస సందడి

● భక్తుల ప్రత్యేక పూజలు 8

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలి 8

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు

'హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం'



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్ విమర్శించారు. పెగడపల్లి మండల బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలతో కలసి ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం తహసీల్దార్ కార్యయలంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు మారారు కాని పాలన మారలేదని విమర్శించారు. పేదల కడుపు కోత అలానే ఉందని, కాంగ్రెస్ బీఆర్ఎస్ దొందూ దొందే అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారానే పల్లెల అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ దేశాలలో విశ్వగురువుగా ప్రఖ్యాతి పొందిందని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగుల నిరుద్యోగ భృతి రూ.3016, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, సాంఘీక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, నాయకులు గంగుల కొమురెల్లి, మాజీ ఎంపీటీసీ చింతకింది అనసూర్య, కోట మల్లేశం, బాబు, అంజన్న, భీమయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం శ్రావణ భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసంలో పవిత్ర దినంగా భావించే మూడవ సోమవారం శివాలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. క్షేత్రానికి ఉదయం వరకు తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేశారు. ఉపావాస దీక్ష చేపట్టిన అనేక మంది భక్తులు సైకత లింగాలు చేసి పసుపు, కుంకుమ చల్లి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. కొబ్బెరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర, క్షేత్ర సమీపంలో గల శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయాలకు చేరుకున్నారు. ఆలయ వేదపండితులు, అర్చకులు శివాలయాల్లో స్వామి వారలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, అన్నపూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు బూస ప్రవీణ్‌కుమార్, జన్మంచి శ్రీనివాస్, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సాయికుమార్ పాల్గొన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,మన్పోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం తేది: 20-08-2025 వేలం చిరునామా:శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి నం.7-7-55,1వ అంతస్తు,7-7-56,2వ అంతస్తు,తహసిల్ చౌరస్తా,జగిత్యాల,జగిత్యాలజిల్లా,తెలంగాణ

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
KORTLPJ2502120003	AYESHA NOOR	JAGTIPJ2411200002	NAKKA GANGAPEDDULU
KORTLPJ2502150002	AYESHA NOOR	JAGTIPJ2502200003	PATHANGI ANKUL
KORTLPJ2502170006	MOHAMMED IMRAN	MTPL1PJ2502280005	THUMMANAPELLI VENKATARAMA NA
JAGTIPJ2502190005	ANUPURAM SHANKAR		

వేలం తేది: 20-08-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం. 8-4-1,జోనల్ ఆఫీసు ఎదురుగా,ఎల్ ఐసి డివిజనల్ కార్యాలయం సమీపంలో,గణేష్ నగర్, కరీంనగర్.505001

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
KMNGRPJ2502060002	ANIL MUNIGANTI	KMNG2PJ2502180004	RAJU GUGULOTHU
KMNGRPJ2502080002	SHIVA SAI DUSA	KMNG2PJ2502180005	RAJU GUGULOTHU
KNMG3PJ2502100003	ARSHADI BEGUM	KMNG2PJ2502180003	RAJU GUGULOTHU
KNMG3PJ2502100005	MAMIDIPELLY VINEETH	KMNG2PJ2502280003	KOMURAIAH BODAPATLA
KNMG3PJ2502190008	ARELLI SAI KUMAR	KMNG2PJ2503010017	SRINIVAS KADARLA
KMNGRPJ2502270002	CHATLA ANJI	KMNG2PJ2503010016	SRINIVAS KADARLA

వేలం తేది: 21-08-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, HNO.7-78 ,1వ అంతస్తు,,గంగా రెడ్డి రోడ్, మంచిర్యాల,మంచిర్యాలజిల్లా,తెలంగాణ-504208

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
BLMPYPJ2502030005	GOVINDULA SRINIVAS	BLMPYPJ2502200005	ASHOK GOUD RAMAGOUNL
BLMPYPJ2502040004	AKKALA PRASHANTH	MNCRLPJ2411250002	SAIKUMAR KURRAWAR
BLMPYPJ2502170003	ASHOK GORLAPALLY	BLMPYPJ2502280001	MEKALA PRANAY KUMAR

వేలం తేది: 20-08-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి నం.3-2-3,భారతీయ కాంప్లెక్స్,జెండా చౌరస్తా దగ్గర,పెద్దపల్లి-505172.పెద్దపల్లిజిల్లా తెలంగాణ

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
MNTHNPJ2502130001	SWAMY KANUKUNTLA	GDVRKPJ2502200002	GANTA MADHU
MNTHNPJ2502150004	THORATH PRASHANTH	MNTHNPJ2502220002	THORATH PRASHANTH
MNTHNPJ2502170011	THORATH PRASHANTH	MNTHNPJ2411290005	KANNEBOINA ODELU

వేలం తేది: 26-08-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం. 8-4-1,జోనల్ ఆఫీసు ఎదురుగా,ఎల్ ఐసి డివిజనల్ కార్యాలయం సమీపంలో,గణేష్ నగర్, కరీంనగర్.505001

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
HUZRDPJ2502050002	PESARU SAMPATH	JMKNTPJ2502130007	ENUGALA RAJENDAR
JMKNTPJ2502060002	JIDI RAKESH	JMKNTPJ2502200004	MD SHABANA
JMKNTPJ2502070004	CHILUMULA YASHWANTH	JMKNTPJ2502210001	NARESH JETTI

వేలం తేది: 20-08-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం. 8-1-61 నుండి 8-1-65,1వ అంతస్తు,జననీ కాంప్లెక్స్,హైదరాబాద్ రోడ్,సిద్దిపేట-502103,తెలంగాణ

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
SIDP2PJ2502040008	PABBATHI LAXMI	HUNBDPJ2502210011	BONAGIRI THIRUMALA
HUNBDPJ2502070001	RAVINDER ANDE	HUNBDPJ2502210002	PILLUTLA PARSHARAMULU
HUNBDPJ2502110005	MOHAMMAD SHAKEEL	HUNBDPJ2502210012	SRINIVAS GOUD MARKA
HUNBDPJ2502190011	VODDAMALLA LAXMIRAJU	SIDP2PJ2502220005	GALAM PRAKSH
SIDP2PJ2502200002	CHITTI REDDY LAXMI	SIDP2PJ2502280006	MUCHARLA RAVI TEJA

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ ఎం.అశోక్ కుమార్** ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 12.08.2025
స్థలం: కరీంనగర్

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, KORUKANTI VENU MADAVA RAO, H.NO.4-44, DURSHED, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS KORUKANTI VENU MADHAVA RAO S/O. KORUKANTI THIRUPATHI RAO

AJK-17125

పాస్‌పోర్ట్ పోయినది

★ కొత్తూరి రాజేందర్ S/o. నర్సయ్య, R/O. 1-72, రేవెల్లి గ్రామం, చొప్పదండి మం॥ కరీంనగర్ జిల్లా. తేది: 08-08-2025 రోజున నేను రేవెల్లి గ్రామం నుండి చొప్పదండికి వెలుతున్న ప్రయాణంలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెం. A7743870 దొరికినవారు తెలుపగలరు. సెల్: 9441557929

AJK-17127

3+2 స్కీం కలదు

పాస్‌పోర్ట్ పోయినది

★ ముప్పిడి శ్రీనివాస్‌రెడ్డి S/o. నారాయణరెడ్డి, R/O. 2-10-1719/9, హరిదుర్గ హోమ్స్, మహాశక్తి టెంపుల్ దగ్గర, చైతన్యపురి, కరీంనగర్. తేది: 31/07/2025 రోజున నేను చైతన్యపురి నుండి టవర్ సర్కిల్‌కు వెలుతున్న ప్రయాణంలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెం.B0283490 దొరికినవారు సంప్ర: 6302391280

AJK-17127

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు



నిందితులను అరెస్టు చూపుతూ మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

మంథని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గోదారిఖని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అక్రమ సంపాదన, జల్సాల కోసం గంజాయి రవాణా, క్రయ, విక్రయాలు జరిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ మడత రమేష్ హెచ్చరించారు. ఎక్లాస్‌పూర్ శివారులోని గాడుదులగండి గుట్ట సమీపంలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన మంథనిలోని పోచమ్మవాడకు చెందిన బండారి అభిషేక్ అలియాస్ అంజీ, సూరయ్యపల్లి గ్రామానికిచెందిన కోరవేన రవిసాగర్, ఖానాపూర్ గ్రామానికి చెందిన పుట్ట అలియాస్ కొవ్వూరి అజయ్‌కుమార్‌లను సీఐ కార్యాలయంలో ఏసీపీఆధ్వర్యంలో సోమవారం అరెస్టు చూపారు. అరెస్టు అయిన వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. మహారాష్ట్రలోని సిర్వోంచ ప్రాంతంలో కొనుగోలు చేసిన 2.23 కిలోల ఎండు గంజాయి, ఒక బైక్, రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. గోదావరిఖని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో గంజాయి రవాణా, ఇతర మత్తు పదార్థాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. మంథని ఎస్ఐ రమేష్ ముగ్గురువ్యక్తులు గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరి విచారణలో మంథని ప్రాంతంలో మరో 20 మంది గంజాయి రవాణా, విక్రయాలు, తాగడం లాంటి అలవాటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలన్నారు. గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐ రమేష్‌లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఓలారీ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో గాయపడిన క్షతగాత్రుడు చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కొండపర్తి సమ్మయ్య ఈ నెల 9న తన ద్విచక్ర వాహనంపై కాట్రపల్లి నుంచి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సకోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన పిట్ల దేవయ్య(60) ఆదివారం రాత్రి మద్యంతాగి రోడ్డుపై నిల్చొని ఉండగా అతడి కొడుకు చందు బలవంతంగా తీసుకువచ్చి ఇంట్లో ఉంచాడు. తెల్లారిసరికి పిట్టల దేవయ్య ఇంట్లో చనిపోయి ఉన్నాడని దేవయ్య తమ్ముడు లస్మయ్య ఫిర్యాదు చేశాడు. ఈ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నల్లగుంటపల్లికి చెందిన వడ్లూరి అంజయ్య ఇటీవల తన మొబైల్‌ఫోన్‌ను బొమ్మకల్‌లో పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నిరంజన్‌రెడ్డి ఆదేశాలతో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా హన్మకొండలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం యజమానిని ఠాణాకు పిలిపించి ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఫోన్‌ను ట్రేస్ చేయడంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

గ్రంథాలయం.. విజ్ఞాన భాండాగారం

● నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చదవడం వ్యాయామం వంటిదని ఆంగ్ల వ్యాసకర్త, కవి, నాటక రచయిత జోసెఫ్ అడిసన్ అన్నారు. చదవడంతో మెదడు సామర్థ్యం, పనితీరు మెరుగుపడుతుంది. మస్తిష్క వికాసానికి మంచి సాధనం పుస్తకం. ప్రజల్లో చదివే అలవాటును ప్రోత్సహించడంతోపాటు అక్షరాస్యత, పుస్తకాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ఏటా ఆగస్టు 12 గ్రంథాలయోద్యమ పితామహుడు శియాలీ రామామృత రంగనాథన్ జన్మదిన సందర్భంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

లుక్ కల్చర్ వద్దు.. బుక్ కల్చర్ ముద్దు

డిజిటల్ ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, గూగుల్ వలలో పడి బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చింది. గ్రంథాలయాలు నిరాదరణకు గురవుతున్నాయి. పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తక మహోత్సవాలు, ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే మార్పు రావచ్చు.



లైబ్రరీ సైన్స్ పితామహుడిగా రంగనాథన్ సేవలు

గ్రంథాలయాల ప్రాధాన్యం గుర్తించిన రంగనాథన్ లైబ్రరీ సైన్స్ పితామహుడిగా సేవలందించారు. విద్యావేత్తగా పలు రచనలు చేసి, గ్రంథాలయోద్యమంలో కీలక భూమిక పోషించారు. తమిళనాడులో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో సీతామహాలక్ష్మి-రామామృత అయ్యర్‌కు జన్మించిన ఆయన జీవితాన్ని రచనలు, గ్రంథాలయాల స్థాపనకు ధార పోశారు. ఇంగ్లాండ్‌లో లైబ్రరీ సైన్స్ చదివారు. యూనివర్సిటీలలో లెక్చరర్‌గా, లైబ్రేరియన్‌గా సేవలందించారు. మద్రాసు గ్రంథాలయ సంఘాన్ని స్థాపించడంలో కృషి చేశారు.

గ్రంథాలయాలతో లాభాలు

గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగు పడుతాయి. రచన, పఠన, లేఖనం అలవాటు పెరుగుతుంది. స్పష్టంగా సంభాషించవచ్చు. చరిత్ర, సైన్స్, సాహిత్యం వంటి అంశాలపై సమాచారం లభిస్తుంది. వివిధ విషయాల అన్వేషణ, ప్రపంచం గురించి లోతైన అవగాహనకు వీలు కలుగుతుంది. కొత్త సంస్కృతులను, ఆలోచనలను, దృక్పథాలను పరిశీలించవచ్చు.

విమర్శనాత్మక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు, తార్కిక దృష్టి, ఊహ, సృజనాత్మక పెరుగుతాయి. నిద్ర, ఆయుష్షు పెరుగుతుంది. అల్జీమర్ వ్యాధి వచ్చే అవకాశం తక్కువ.

పుస్తక పఠనంలో కీలకం

ఇంట్లో ఉన్న పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలు, మ్యాగ్జైన్లతో పాటు గ్రంథాలయాలు పఠనలో కీలక పాత్ర పోషిస్తాయి. కావాల్సిన పుస్తకాలు ఇంటికి తెచ్చుకొని, నచ్చిన అంశాలు, సమాచారాన్ని నోట్ చేసుకొని తిరిగి ఇవ్వవచ్చు. ప్రస్తుతం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ప్రతీ రోజూ సుమారు 400 మందికి పైగా, పలు మండలాల్లో 120కి పైగా పాఠకులు సందర్శిస్తున్నారు.

చదువుతో విజ్ఞానం
సత్తు మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



చదువుతో విజ్ఞానం, వికాసం లభిస్తాయి. గ్రంథాలయంలో ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు తెప్పిస్తున్నాం. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన నూతన భవన నిర్మాణం త్వరలో పూర్తవుతుంది. పాఠకులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలి.

రోజూ వస్తాను
గుంటుకు జితేంద్ర, తాడిజెర్రి



రెండు సంవత్సరాల నుంచి రోజూ గంగాధర మండలం తాడిజెర్రి గ్రామం నుంచి డీసీఎల్‌కు వస్తాను. దిన పత్రికలు, సైన్స్ పుస్తకాలు చదువుతాను. ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఇక్కడ ప్రశాంతంగా ఉంటుంది.

రెండు ఆలయాల్లో చోరీ

● హుండీలు పగుల గొట్టి నగదు అపహరణ

గంగాధర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం న్యాలకొండన్నపల్లి శివారులోని వేంకటేశ్వరస్వామి, శివాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి వేంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయాలకు ఎప్పటి మాదిరిగానే ఆలయ ఇన్‌చార్జి మేడిచెల్మల రాజు తాళాలు వేసి వెళ్లారు. సోమవారం ఆలయాలకు వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా ఆలయంలోని హుండీలను పగులగొట్టి అందులోని సుమారు 6వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆలయ ఇన్‌చార్జి రాజు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మత్తులో డ్రైవర్ వీరంగం

గంగాధర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మత్తులో విచక్షణ కోల్పోయిన డ్రైవర్ లారీ ఓనర్‌తో గోడవపడి వీరంగం సృష్టించాడు. స్థానికుల కథనం ప్రకారం.. యాపిల్ పళ్ల లోడుతో వచ్చిన లారీ కరీంనగర్ మార్కెట్లో డంపుచేసి తిరుగు పయణమయ్యారు. అయితే మత్తులోఉన్న లారీడ్రైవర్, ఓనర్‌తో గొడవకు దిగాడు. రామడుగు మండలం వెదిరలో ఇద్దరు తగవులాడుకున్నారు. దీంతో సహనం కోల్పోయిన ఓనర్ పోలీస్ స్టేషన్‌ను వెదుక్కుంటూ గంగాధరకు వచ్చాడు. గంగాధర పోలీస్‌స్టేషన్ సమీపంలో మరోమారు గొడవకుదిగారు. దీంతో మత్తులోఉన్న డ్రైవర్‌ను అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

పార్కింగ్ చేసిన కారును ఢీ కొట్టిన మరో కారు

హుజూరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లోని సబ్‌స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న కారును వెనుక నుంచి మరో కారు ఢీ కొట్టింది. దీంతో ఆ కారు ముందు ఉన్న మరో కారును ఢీ కొట్టింది. దీంతో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయంపై ఇరువురు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. కాగా కరీంనగర్ రోడ్‌లో ఉన్న రెండు హోటళ్ల ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుంటారని, దీనిపై పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.

గొడవ పడ్డ వ్యక్తుల బైండోవర్

కోల్‌సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రాజేష్ థియేటర్ పాన్‌షాప్ వద్ద సిగరెట్ తాగే విషయంలో రోడ్డుపై గొడవపడ్డ పలువురు వ్యక్తులను సోమవారం బైండోవర్ చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. చిన్నవిషయాలకు రోడ్డుపై పరస్పరం గొడవ పడడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారన్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలానికి వెళ్లి గొడవ పడిన వ్యక్తులను అరెస్టు చేశారన్నారు. వారు సత్ప్రవర్తనతో ఉండాలని, భవిష్యత్‌లో గొడవలు పడకుండా బైండోవర్ చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

బైక్‌ను దొంగలించిన వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో బైక్‌ను దొంగించిన సంఘటనలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాలకు చెందిన బానోతు తిరుపతిని పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన ముత్యాల సాయికిరణ్‌కు రాజన్నపేట గ్రామ శివారులో వ్యవసాయ పొలం ఉంది. వ్యవసాయ బోరు మోటారు పని చేయకపోవడం వల్ల మరమ్మతు కోసం తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటలోని మెకానిక్ నీరటి శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. ఆయన ఈనెల 8న తన బైక్‌పై చేరుకుని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. బోరు మోటారును మరమ్మతు చేసి వాహనం వద్దకు వచ్చే సరికి కనిపించకుండాపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరుపతి ద్విచక్రవాహనాన్ని అపహరించాడని గుర్తించి పట్టుకున్నారు. కోర్టులో హాజరుపర్చడంతో న్యాయమూర్తి 14 రోజుల పాటు జైలుకు తరలించారని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

చట్ట వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం

● మధురానగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్ ● పత్రాలు లేని 94వాహనాలు సీజ్


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటస్వామి

గంగాధర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ఎన్ వెంకటస్వామి హెచ్చరించారు. గంగాధర మండలం ప్రధానరహదారిపై మధురానగర్‌లో ఏసీపీ వెంకటస్వామి ఆధ్వర్యంలో విస్తృతంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ అనుమానిత వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 91ద్విచక్రవాహనాలు, ఆటో, కారు, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చౌరస్తాలో ఏసీపీ వెంకటస్వామి మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురైతే 1930 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. గంటలోపు ఫోన్ చేస్తే పోగొట్టుకున్న సొమ్మును త్వరగా రికవరీ చేయవచ్చన్నారు. మాదక ద్రవ్యాలు అక్రమరవాణా, అమ్మకం, వినియోగం చట్టపరంగా నేరమని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు 100లేక స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్ రహిత సమాజ నిర్మాణంకోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా షీటీమ్ సీఐ శ్రీలత సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్, సీఐలు శ్రీలత, కోటేశ్వర్‌రావు, సదన్ కుమార్, సంజీవ్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, ఎస్సైలు నరేంద్రరెడ్డి, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్సై పుల్లయ్య, సయ్యద్ అన్వర్, లక్ష్మారెడ్డి, నరేష్, ఇతర పోలీస్ సిబ్బంది, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమారుడి జన్మదినానికి వచ్చి హఠాన్మరణం

● మూడు రోజుల క్రితమే సింగపూర్ నుంచి రాక


మధుకర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తన కొడుకు పుట్టినరోజు ఘనంగా నిర్వహించాలని అనుకున్న తండ్రి మూడు రోజుల ముందుగా సింగపూర్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. వేడుకలకు బంధువులు, స్నేహితులు ఆహ్వానించి అన్నిఏర్పాట్లు చేసుకున్నాడు. ఆదివారం తన కొడుకు జన్మదిన వేడుకలను నిర్వహించి విందులో పాల్గొంటుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్ జిల్లా కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లికి చెందిన దావు మధుకర్‌రెడ్డి(46) సింగపూర్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఆయన భార్య, కుమారుడు, కూతురు చామనపల్లిలో ఉంటున్నారు. మధుకర్‌రెడ్డి కుమారుడు సాత్విక్‌రెడ్డి 10వ జన్మదినం ఆదివారం ఉండగా, పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు మధుకర్‌రెడ్డి శనివారం(9వతేది) సింగపూర్ నుంచి చామనపల్లికి వచ్చాడు. అన్నిఏర్పాట్లు చేసుకుని బంధువులు, స్నేహితులను వేడుకలకు పిలుచుకుని ఇంటి వద్దనే ఆదివారం జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం రాత్రి బంధువులతో విందులో పాల్గొన్న మధుకర్‌రెడ్డి హఠాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే మధుకర్‌రెడ్డిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ హఠాత్ పరిణామంతో మధుకర్‌రెడ్డి భార్య, కూతురు, కొడుకు, బంధువులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. మధుకర్‌రెడ్డి ఈ నెల 9 నుంచి 10 రోజుల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. శనివారం రాఖీపౌర్ణమి పండుగను జరుపుకోగా, ఈ నెల 17న సమీపబంధువు వివాహానికి హాజరై 19న తిరిగి సింగపూర్ వెళ్లాల్సి ఉంది.

గ్యాస్‌స్టౌవ్ రిపేర్ షాపుల్లో పోలీసుల తనిఖీలు


షాపులను తనిఖీ చేస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని గ్యాస్ స్టౌవ్‌లు, సిలిండర్ రిపేర్ షాపుల్లో సోమవారం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు జరిపారు. కొందరు వ్యాపారులు గ్యాస్‌స్టౌవ్ రిపేర్ల పేర సిలిండర్ల నుంచి ఎలక్ట్రికల్ డీసీ మోటార్ల సహాయంతో కార్లలో గ్యాస్‌రీఫిల్లింగ్ చేస్తున్నారని, చిన్న సిలిండర్లలో గ్యాస్ నింపుతున్నారన్నారు. అలా గ్యాస్ నింపే క్రమంలో ఇటీవల మంటలు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారని, కొందరు చొరవ తీసుకుని మంటలు ఆర్పకపోతే భారీ ప్రమాదం జరిగేదన్నారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేయడం నేరమని, ఇలాంటి వారికి సిలిండర్ అమ్మినా, సహకరించినా నేరస్థులుగా పరిగణిస్తామన్నారు. గ్యాస్ స్టౌవ్ రిపేర్ చేసే యజమానులు, అందులో పని చేసే వారిని బైండోవర్ చేసినట్టు సీఐ తెలిపారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

● 50 గ్రాముల ఎండు గంజాయి, బైక్ స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామశివారులో విక్రయించేందుకు వచ్చిన ముగ్గురు యువకులు స్థానిక పోలీసులకు చిక్కారు. వారివద్ద నుంచి 50గ్రాముల ఎండు గంజాయితోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చున్నారు. ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ సోమవారం వివరాలను వెల్లడించారు. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామశివారులోని జంపన్న చెరువు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం పందిమడుగు, వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాలో నివాసం ఉంటున్న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడువాసి బానోతు అజయ్‌కుమార్, సీతారాంనాయక్‌తండాలోని అజ్మీరా సాయివిశాల్‌లు తచ్చాడుతూ కనిపించారు. అదుపులోకి తీసుకుని తనిఖీ నిర్వహించడంతో వారివద్ద గంజాయి లభించింది. గంజాయికి అలవాటు పడిన నిందితులు నిజామాబాద్ పట్టణంలోని గుర్తు తెలియని వ్యక్తి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఈ ప్రాంతంలోని యువకులకు అధిక ధరకు విక్రయిస్తున్నారని విచారణలో తేలింది. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్ వివరించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ లక్ష్మణ్, సిబ్బందిని సీఐ శ్రీనివాస్ అభినందించారు.

అదుపులోకి రాని మంటలు

● సివిల్ సప్లయిస్ గోదాంలో శ్రమిస్తున్న అగ్నిమాపక సిబ్బంది
● దగ్ధమైన 9.07 లక్షల గోనె సంచులు, రూ.70లక్షలు నష్టం
● మంటలు ఆర్పడానికి మిషన్ భగీరథ నీరు


మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మెట్‌పల్లిపట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోగల సివిల్‌సప్లయిస్ గోదాంలో చెలరేగిన మంటలను ఆర్పడానికి అగ్నిమాపక సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. గోదాంలోని 9.07లక్షల గోనె సంచులు దగ్ధం కాగా రూ.70లక్షలు నష్టం వాటిల్లిందని సివిల్‌సప్లయిస్ డీఎం జితేందర్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం అకస్మాత్తుగా గోదాంలో నుంచి దట్టమైన పొగరావడాన్ని స్థానికులు గమనించి వెంటనే గోదాం ఇన్‌చార్జి బూరం సురేష్‌తో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక డీఎఫ్‌వో మధుకర్‌రెడ్డి నేతృత్వంలో మెట్‌పల్లి, జగిత్యాల, భీంగల్, ఖానాపూర్, ధర్మపురి అగ్నిమాపకకేంద్రాల నుంచి ఫైరింజన్లు తెచ్చి సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం మంటలు మరింతగా వ్యాపించడంతో అగ్నిమాపక వాహనాలకు నీరు సమయానికి అందకపోవడంతో పక్కన ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లోని నీటిని వాడుతున్నారు. గోదాంలో నుంచి దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎక్స్‌కవేటర్లతో గోదాం గోడలను బద్దలు కొట్టి అందులోంచి కాలుతున్న గన్ని సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేసే ప్రయత్నం చేస్తున్నారు. కాగా మంటల వేడితో ఏ క్షణమైనా గోదాం కూలే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా చుట్టపక్కల వారిని అధికారులు అప్రమత్తం చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. గోదాం కిటికీలు తెరిచి ఉండడం, గోదాం చుట్టూ మద్యం సీసాలు ఉండడంతో మద్యం బాబుల పనా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

● మంటలు త్వరగా అదుపులోకి తీసుకురావాలి..
- కలెక్టర్ సత్యప్రసాద్

మంటలను త్వరగా అదుపులోకి తీసుకోచ్చి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. సోమవారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లోని గోదాం అగ్ని ప్రమాద స్థలాన్ని ఆయన సందర్శించారు. అగ్ని మాపక అగ్ని మాపక డీఎఫ్‌వో మధుకర్‌రెడ్డితో మాట్లాడి త్వరగా మంటలను ఆర్పివేయాలని ఆదేశించారు. మంటలు చల్లారేవరకు అధికారులు అందుబాటులోనే ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, సివిల్ సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్, డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, ఎస్సైలు కిరణ్‌కుమార్, చిరంజీవి, అనిల్, తహసీల్దార్ నీత, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మోహన్ ఉన్నారు.

రూ.7600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7600 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఇద్దరురైతులు పదిక్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చా రు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7600 చెల్లించి ప్రైవేట్ ట్రేడర్స్ కొనుగోళ్లు చేపట్టారు.

108వాహనం తనిఖీ

శంకరపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్ జిల్లా 108 నూతన ప్రోగ్రాంమేనేజర్ జనార్దన్ శంకరపట్నం 108వాహనాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. వాహనంలో ఉన్న వైద్యపరికరాలను, వాటి పనితీరు, ఔషధాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ప్రతిఉద్యోగికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ సమీప ప్రభుత్వాస్పత్రిలో చేర్పించాలన్నారు. 108సిబ్బంది ఈఎంటీ గూడూరు సతీష్‌రెడ్డి, పైలెట్ ఖాజాఖలీల్ పనితీరుపై సంతృప్తి పొందారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామంలోని మోయతుమ్మెదవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని రేణికుంటలో ఎల్ఎండీ పోలీసులు పట్టుకున్నారు. వాహనయాజమాని, డ్రైవర్‌అయిన కోహెడమండలం వింజపల్లి గ్రామానికి చెందిన గీకురురమేష్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా వీణవంక మండలం కోర్కల్ గ్రామంనుంచి హుజూరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆముదాలపల్లి శివారులో సోమవారం కేశవపట్నం పోలీసులు పట్టుకున్నారు. కోర్కల్ గ్రామానికిచెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎరవేణి శ్రీనివాస్‌పై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, అటెండర్ రాకేష్ ఈనెల 5నవిధులు నిర్వహిస్తుండగా గట్టు సాయిరాం, పసునూటి శివ ఇవ్వాళ ఎందుకు డ్యూటీకి వచ్చారని, ఆదివారం సెలవు రోజు ఎందుకు పని చేస్తున్నారని బెదిరించారు. తీవ్రపదజాలంతో దూషించారు. విధులకు ఆటంకం కలిగించినట్లు అనిల్‌కుమార్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.



హరహర మహాదేవ.. శంభో శంకరా..

- భక్తజన సంద్రంగా మారిన రాజన్న క్షేత్రం
- కోడెమొక్కులు, కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ.. శంభో శంకరా.. అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శ్రావణ సోమవారం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 50 వేలకు పైగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. సోమవారం తెల్లవారుజామునే భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. భక్తులు శివ సత్తుల పూనకాలతో ఊగిపోయారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో నాలుగు గంటల పాటు నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, అశోక్‌కుమార్ ఉద్యోగులు నరేందర్, శ్రీనివాస్ చారి, రాజేందర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు.

భీమన్న ఆలయంలో మహాలింగార్చన

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమన్న ఆలయంలో సోమవారం మహాలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజన్న ఆలయ ఈవో రాధాబాయి హాజరై దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కుమార్, సూపరింటెంట్ వెంకటప్రసాద్, రాజేశ్వర్‌రావు ఉన్నారు.



ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి ఉమ్మడి జిల్లాకు 6 వేల టన్నుల యూరియా

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ చొరవ
- ఐదు రోజుల్లో మూడు విడుతలుగా రవాణా...
- యూరియా కొరత వేళ యుద్ధ ప్రాతిపదికన సరఫరా

కోల్‌సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యూరియా కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆర్ఎఫ్‌సీఎల్ యుద్ధ ప్రాతిపదికన యూరియా సరఫరా చేస్తుంది. ప్రాథమిక సహకార సంఘాల వద్ద యూరియా కొరతతో రైతులు బారులు తీరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఐదు రోజుల్లో 6వేల టన్నుల యూరియాను ఆర్ఎఫ్‌సీఎల్ సరఫరా చేసింది. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ తీసుకుని యాజమాన్యాన్ని సమన్వయం చేస్తున్నారు.

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ముగ్గురు వ్యవసాయశాఖ అధికారులు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంతో సమన్వయం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆధ్వర్యంలో మంథని, మంచిర్యాల ఏడీఏ, రామగుండం వ్యవసాయశాఖ అధికారి రేక్‌ల ద్వారా యూరియా రవాణాను పర్యవేక్షిస్తున్నారు. ఒక రేక్ పూర్తిగా, రెండు రేక్‌లు సగం చొప్పున కరీంనగర్ రైల్వేయార్డ్‌కు పంపించారు. అక్కడి నుంచి కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లా, పెద్దపల్లి జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. అధికంగా పెద్దపల్లి జిల్లాకు సరఫరా చేశారు.

ఆగస్టులో 1.5లక్షల టన్నుల యూరియా రవాణాను కేంద్ర ప్రభుత్వం ఆర్ఎఫ్‌సీఎల్‌కు టార్గెట్‌గా నిర్ణయించింది. అందులో 65వేల టన్నులు తెలంగాణకే సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటివరకు కరీంనగర్, మంచిర్యాల, మిర్యాలగూడ, నిజామాబాద్‌లకు డిమాండ్‌ను బట్టి వెంట వెంటనే సరఫరా చేస్తున్నారు. ఒక్కో సమయంలో సగం రేక్ ఒక జిల్లా, మరో సగం రేక్ మరో జిల్లాకు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం జడ్చర్లకు 3వేల టన్నుల రేక్‌ను పంపారు. ఎక్కడెక్కడ యూరియా కొరత తీవ్రత ఉందో అక్కడికి వెంట వెంటనే యూరియా రవాణా చేస్తున్నారు. ఎలాంటి సాంకేతిక అవరోధాలు ఏర్పడకపోతే ఆగస్టు మాసంలో 50వేల టన్నుల నుంచి 55వేల టన్నుల యూరియా తెలంగాణకు సరఫరా చేసే అవకాశం ఉంది.


యూరియా అన్‌లోడ్ చేస్తున్న కార్మికులు

ట్రాన్స్‌ఫార్మర్ చోరీల కేసులో నిందితుల అరెస్టు

భీమదేవరపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్, కరీంనగర్ కమిషన రేట్ల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను హన్మకొండ జిల్లా ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు పట్టుకున్నారు. ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి సీఐ పులి రమేష్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన బండి కుమార్, సతీష్ సోదరులు. వీరు ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలిస్తూ అందులో ఉన్న కాపర్, అల్యూమినియం వైర్లను అమ్మివాటితో వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు వాహనంలో వెళ్తుండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అనుమానస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద టూల్స్ కనిపించాయి. విచారించగా ట్రాన్స్ ఫార్మర్లు చోరీ చేస్తున్న విషయాన్ని వెల్లడించారు. తాము చోరీ చేసిన కాపర్, అల్యూమినియం వైర్‌ను ముల్కనూర్‌కు చెందిన రుద్రాక్ష తిరుపతికి విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు కుమార్, సతీష్, తిరుపతిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ. 2.5 లక్షల విలువ చేసే 250 కిలోల కాపర్ వైరు, మూడు కరెంటు మోటార్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.


మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



విద్యుత్ ఉద్యోగులకు భరోసా

- అందుబాటులోకి బీమా పథకం
- విధి నిర్వహణలో మృతి చెందితే రూ. కోటి పరిహారం
- తీవ్రంగా గాయపడితే రూ.80లక్షలు
- సహజమరణం చెందితే రూ.10లక్షలు

గణేశ్‌నగర్,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఉద్యోగమంటే ప్రాణంతో చెలగాటమే. ప్రమాదం ఎప్పుడు ఎక్కడి నుంచి ముంచుకు వస్తుందో తెలియదు. నిత్యం ప్రమాదం అంచున ఉద్యోగులు పని చేయాల్సి ఉంటుంది. అటువంటి వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు బీమా అమలులోకి వచ్చింది. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) సీఎండీ వరుణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విద్యుత్ ఉద్యోగు లందరికీ బీమా సౌకర్యం కల్పించారు.

ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండానే...

బీమా పొందాలంటే ప్రత్యేకంగా పాలసీ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో ప్రతీ నెలా వేతనం జమ అయితే చాలు. విద్యుత్ సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఉద్యోగి వేతనం నెలకు 25 వేలకు పైగా ఉడాలి. ఒప్పందం చేసుకున్న బ్యాంకుల్లో ప్రతీనెల జీతం జమ కావడమే ఈ బీమాకు అర్హత. ప్రారంభంలో మొదటి నెల 1న జీతం జమ చేస్తే మరుసటి నెల 1వ తేదీ నుంచి నుంచి బీమా వర్తిస్తుంది. మూడు నెలల్లో ఒక్క సారైన డబ్బులు డ్రా చేసుకోవాలి. ఎన్పీడీసీఎల్ పరిధిలో పని చేసే అటెండర్, వాచమన్ మొదలుకొని ఎస్ఈ వరకు ఈ బీమా వర్తిస్తుంది. ఈ బీమా పథకం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాలకు గాను 13,287 మంది ఉద్యోగులకు వర్తించగా వీరిలో ఉద్యోగులు 9,821 కాగా ఆర్టిజన్ కార్మికులు 3,466 మంది ఉన్నారు. ఈ పథకం కింద జిల్లాలో సుమారు 1918 మందికి పైగా ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారు.

భారీగా పరిహారం

గతంలో విద్యుత్ ఉద్యోగి విధి నిర్వహణలో మరణించినా, తీవ్రంగా గాయపడినా సంస్థ అందించే పరిహారం తక్కువగా ఉండేది. వారు వ్యక్తిగతంగా చేసుకున్న బీమా పాలసీల ద్వారా మాత్రమే పరిహారం అందేది. ప్రస్తుతం కల్పిస్తున్న బీమా సౌకర్యం వల్ల విధినిర్వహణలో విద్యుత్ ఉద్యోగి మరణిస్తే కోటి రూపాయల వరకు పరిహారం అందుతుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కదలలేని స్థితిలో ఉన్న ఉద్యోగులకూ కోటి రూపాయల వరకు పరిహారం అందేలా ఏర్పాట్లుచేశారు. శాశ్వత అంగ వైకల్యం (పీపీడీ) కలిగిన వారికి 80లక్షల పరిహారం వరకు అందుతుంది. ఉద్యోగి సహజమరణం చెందితే 10 లక్షల రూపాయల వరకు బీమా ఉంటుంది. ఉద్యోగితో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి 20 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుంది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూనియన్ బ్యాంక్(యూబీఐ)తో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఎస్‌బీఐలో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా పెళ్లి, విద్య పరమైన సహాయంలోను రుణాలు బ్యాంకులు అందించనున్నారు.



మృతి చెందిన విద్యుత్ కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల ప్రమాద బీమా పరిహారం (ఫైల్)



బీమా పథకంతో ఉద్యోగులకు మేలు
మేక రమేష్‌బాబు, టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ

గతంలో డిపార్ట్మెంట్ పరంగా లేదా సొంతంగా చేసుకున్న బీమా పథకం ద్వారా మాత్రమే పరిహారం అందేది. ఇటీవల కరీంనగర్ సర్కిల్ పరిధిలోని చెంజర్ల సెక్షన్‌లో పని చేసే జోగు నరేశ్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకోటి రూపాయల ప్రమాద బీమా పరిహారం అందజేశారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 1,918 మందికిపైగా ఉద్యోగులకు మేలు జరుగుతుంది.



ఆలయ వసతి గదుల్లో నాగుపాము

వేములవాడ కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ పార్వతిపురం వసతి గదుల్లో నాగుపాము ప్రత్యక్ష మైంది. వసతి గదుల బ్లాక్‌లో మెట్ల కిందకు వెళ్లిపోయింది. దీంతో ఆలయ ఉద్యోగులు స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించడంతో పామును పట్టుకునేందుకు సదరు వ్యక్తి గంటపాటు శ్రమించినట్లు తెలిపారు. ఆలయ వసతి గదుల్లో నాగుపాము రావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వరల్డ్ బ్యాంకు కన్సల్టెన్సీ టీం సభ్యుడు కిషన్

మానకొండూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని వరల్డ్ బ్యాంకు కన్సల్టెన్సీ టీం సభ్యులు కిషన్, పిలిప్ సూచించారు. మండలంలోని అన్నారం సబ్‌సెంటర్‌ను సోమవారం వారు సందర్శించారు. గ్రామంలో శానిటేషన్, ప్రజల ఆరోగ్యం, పరసరాల పరిశుభ్రత, వైద్యసేవలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్య, వైద్యం, తదితర విషయాలను తెలుసుకున్నారు.

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవన్నారు. మురికి కాల్వలలో నీటి నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సల్మాన్, రాజ్‌నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం

ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం ఉండదు

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం స్పీకర్‌దే
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం ఉండదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సోమవారం కరీంనగర్‌లో సుడా వాణిజ్య భవన సముదాయ నిర్మాణానికి, ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కూడా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ విషయంలో పెద్ద తప్పు చేసిందని, విచారణలో అన్ని విషయాలూ వెల్లడవుతాయని అన్నారు.

మరోసారి ఇలాంటివి జరుగకుండా తప్పు చేసినవారికి శిక్ష పడేలా కార్యాచరణ ఉంటుందన్నారు. ఎవరిని విచారించాలన్న దానిపై సిట్ బృందం నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో ముందుకుసాగుతున్నాయని విమర్శించారు. కాళేశ్వరం నిర్మాణం తరువాత ఐదేళ్లు బీజేపీ అధికారంలో ఉందని, దానిపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడుతుంటే అడ్డుకోవడంతోపాటు బీఆర్ ఎస్‌కు షెల్టర్ ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నట్లు బీజేపీ నాయకుల వైఖరి కనిపిస్తోందన్నారు.

కేంద్రం పరిధిలో బీసీ రిజర్వేషన్ల బిల్లు

బీసీల 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపించామని, గవర్నర్ రాష్ట్రపతికి పంపించారని మంత్రి తెలిపారు. ఇప్పుడు బిల్లు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని, వారే వెల్లడించాలని అన్నారు. రిజర్వేషన్ల బిల్లుపై చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ఎనిమిది మంది ఎంపీలు జంతర్‌మంతర్ ధర్నాలో ఎందుకు పాల్గొలేదని ప్రశ్నించారు. వివిధ పార్టీల ఎంపీలు ధర్నాకు సంఘీభావం తెలిపారన్నారు. పార్టీమారిన 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారన్నారు.

కరీంనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అతి త్వరలో కార్యాచరణ ఉంటుందన్నారు. పారి శ్రామిక కారిడార్‌కు కేంద్రం ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు ప్రకటించిందని, ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. ఇందుకు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సహకారం కోరుతున్నామన్నారు. తెలంగాణలో పారిశ్రామికవాడలు, పెట్టుబడులు రావాలని, ఇక్కడ ఉన్న యువత కు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బేషజాలు లేకుండా కేంద్రమంత్రులను కలుస్తున్నామని తెలిపారు.

డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారమే ముందుకు

కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ముందుకుసాగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్లానింగ్ ఎగ్జిక్యూషన్‌లో నిర్మాణంలో లోపాలున్నాయని, నీటిని నిలువ చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని డ్యాంసేఫ్టీ అధికారులు నివేదికలో చెప్పడంతో నీటిని నిలువ చేయలేదన్నారు. నీటిని నిలువతో మేడిగడ్డ సమస్య ఎదురైతే ఆ పరిసరాలు ముంపునకు గురయ్యే అవకాశముందన్నారు. అందుకే అథారిటీ ఇచ్చే నివేదిక ద్వారా ప్రతీ కార్యక్రమం చేపట్టాలని ఆలోచన చేస్తున్నామన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కొంత మంది డ్రామాలాడు తున్నారని, నాణ్యతతో పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. మేడిగడ్డ ప్రాజెక్టు కూలిపోతే ఆ రోజు ఏమీ మాట్లాడని వారు ఈ రోజు నీరు కావాలంటున్నారని, అథారిటీ నివేదిక నిర్ధారణ సర్టిఫికెట్‌ను ఉపయోగించి చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు న్యాయం చేసేందుకు తాము వెనుకడుగువేయబోమన్నారు. సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కటుకం మృత్యుంజయం, ఆరెపల్లి మోహన్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి హెల్త్ స్కీం అవసరం

సుభాష్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి హెల్త్ స్కీం అవసరమని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని సుడా కార్యాలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా బెనిఫిట్స్ చెల్లింపుల్లో ఆలస్యం, హెల్త్‌స్కీం అమలు అవసరాలను వివరించారు. హౌస్ బిల్డింగ్ రుణాలు, జీపీఎఫ్ రుణాలు, టీఏ బిల్లులు, జీఎల్ఐ బిల్లులు, వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు నగదు రహిత వైద్యం అందించడంలో ఎంప్లాయిస్ హెల్త్‌స్కీం కీలకపాత్ర పోషి స్తుందన్నారు వైద్య ఖర్చుల భారం గణనీయంగా తగ్గుతుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి ఎంప్లాయిస్ హెల్త్ స్కీంకు సంబంధించి త్వరలోనే తీపి కబురు వింటారని ఉద్యోగులకు భరోసా కల్పించారు. సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు నాగుల నర్సింహస్వామి, గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కు మార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి వెలి చాల సుమంత్‌రావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, ఎడ్ల మహేశ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


మంత్రులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు


శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 11,483 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీలోకి 11,483 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 44.71 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, కలిపి ప్రాజెక్టు నుంచి 5,658 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, వరద కాలువకు 3 వేల క్యూసెక్కులు, అల్లీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కుఉల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 135 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 462 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 37.659 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 6.479 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

వరద కాలువకు నీరు నిలిపివేత...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువకు నీటి విడుదలను సోమవారం అధికారులు నిలిపివేశారు. మధ్యాహ్నం 1.15 గంటల నుంచి ఇందిరమ్మ వరద కాలువ హెడ్ రెగ్యులటరీ గేట్లు మూసి వేసి నీటి విడుదల నిలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద కాలువకు నీటి విడుదల నిలిపి వేసినట్లు ఎస్సారెస్పీ ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు.




నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

యువతా మేలుకో..

గణేశ్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యువత అంటే వ్యక్తుల సమూహం కాదు... వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్లాలని చూసే మహత్తరమైన శక్తి. అలాంటి శక్తి, యుక్తుల సమహారంగా జరుపుకునేదే అంతర్జాతీయ యువజన దినోత్సవం. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 12న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన వేడుకలను ప్రతి సంవత్సరం ఒక్కో దేశంలో నిర్వహిస్తుంటారు. సమాజానికి పౌరులకు సంబంధించిన ఒక (థీమ్) అంశంతో ఈ వేడుక నిర్వహిస్తారు.

- **నేపథ్యం**

1999వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం ద్వారా మొదటి అంతర్జాతీయ యువజన దినోత్సవం ఆగస్టు 12, 2000న నిర్వ హించారు. అప్పటి నుంచి ఆగస్టు 12ను అంతర్జాతీయ యువజన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తున్న ఈ వేడుక రజతోత్సవాన్ని ఈ యేడు కెన్యా దేశంలో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలో వివిధ దేశాలకు చెందిన లక్షలాదిమంది యువత పాలుపంచుకుంటుంది. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఈసారి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు- స్థానిక యువత చర్యలు థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

- **అంతర్జాతీయ వేదికలపై జిల్లా వాసులు**

కరీంనగర్ జిల్లాలోని పలువురు యువజన సంఘాల ప్రతినిధులు జాతీయ స్థాయిలో ఉత్తమ యువజన వార్డులు అందుకోవడంతోపాటు అంతర్జాతీయ యువజన వేడుకల్లో పాల్గొన్నారు. గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామానికి చెందిన నెహ్రూ యూత్ క్లబ్ అధ్యక్షుడు రేండ్ల కళింగ శేఖర్,షిప్ ఫర్ వరల్డ్ యూత్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. కరీంనగర్‌కు చెందిన వివేకానంద యూత్ క్లబ్ అధ్యక్షుడు ఎ కిరణ్‌కుమార్ ఇండో- చైనా యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగాంతో పాటు మలేషియా, సింగపూర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యువజన- సాంస్కృతిక వేడుకల్లో పాల్గొన్నారు. రామడుగు మండలం గోపాలరావుపేటకు చెందిన సబర్మతి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అలువాల విష్ణు ఇండో- చైనా యూత్ ఎక్స్ఛేంజ్ వేదికలో భారతదేశ ప్రతినిధిగా పాల్గొన్నారు.

- **జిల్లాలో వేడుకల నిర్వహణ**

జిల్లాలోని యువత ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహిస్తుంది. అందుకు అనుగుణంగా అంతర్జాతీయ యువజన వేడుకల అంశాల వారీగా అవగాహన సదస్సులను, ఫొటో ప్రదర్శనల వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.



జంక్ ఫుడ్ నుంచి యువత రక్షించుకోవాలి..
డాక్టర్ ఒల్లాల శ్రావణ్‌కుమార్, జనరల్ ఫిజీషియన్



యువత ఆరోగ్యంగా ఉంటేనే ఆ దేశ భవిష్యత్తు బాగుంటుంది. అంతర్జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో, భారతదేశంలోని యువత ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడం చాలా ముఖ్యమైనది. నేటి యువతలో 56.4 శాతం వ్యాధులకు అనారోగ్యకరమైన జంక్ ఫుడ్ ప్రధాన కారణం. యువత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. జంక్ ఫుడ్‌ను తీసుకోవద్దు.

యువతకు ఆరోగ్య యోగా అవసరం..
ముత్యాల రమేష్, యోగా మాస్టర్

వేగంగా మారుతున్న నేటి యుగంలో యువత ఎంతో ఒత్తిడికి, ఆందోళన గురవుతున్నారు. యువత జీవన విధానంలో ఏర్పడే భావోద్వేగాలను సరి చేసుకోవడానికి ఆరోగ్య యోగ కచ్చితంగా అవసరం. ఈ తరం యూత్ ప్రతిరోజు కనీసం 30 నిమిషాలపాటు యోగాకు కేటాయిస్తే మంచి ఆరోగ్య ఫలితాలు అందుతాయి. యోగా ద్వారా యువతకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థయిర్యాన్ని ఇస్తుంది.



గీత కార్మికుడి ఆత్మహత్య

మల్యాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రెగుండంలో గీత కార్మికుడు తాటిచెట్టుపై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగు అంజయ్యగౌడ్(45)అనే వ్యక్తి సోమవారం తాటిచెట్టు ఎక్కి అక్కడే తాడుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణంగా తెలుస్తోంది. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

మల్యాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం తాగుడుకు బానిస అయిన భర్త నిత్యం వేధిస్తుండడంతో తాళలేక భార్య మరికొందరి సహాయంతో సుపారి ఇచ్చి హత్యకు పాల్పడిన సంఘటనలో ఇప్పటికే ఒక్కరిని అరెస్టు చేసిన పోలీసులు సోమవారం మరో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. మెట్‌పల్లి సాయిరాం నగర్ కాలనీకి చెందిన సింగం నడిపి గంగాధర్(45)అనే వ్యక్తి 12మార్చి2023న కొండగట్టులో హత్యకు గురికాగ గంగాధర్ హత్యఘటనలో మృతుడి భార్యతో పాటు మరో అయిదుగురు ఉండగా ఒకరు మృతి చెందారు. గతనెలలో మృతుడి భార్యను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కాగ మిగితా ముగ్గురు సింగం గ్రాహిత్, అబ్దుల్ అఫ్సర్, చెన్న నిఖిల్‌ను సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన టీఎన్జీవో నాయకులు

జగిత్యాలఅర్బన్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రసంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను జగిత్యాల జిల్లా టీఎన్జీఓ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రిని కలిసిన టీఎన్జీఓ నాయకులు ఇటీవలే సాధారణ బదిలీలు, పరిపాలన సంబంధిత ఉద్యోగుల బదిలీల్లో దివ్యాంగులకు మినహాయింపు ఇస్తు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ అధ్యక్షులు మిద్యాల నగేందర్‌రెడ్డి, కార్యదర్శి అమరెందర్, సాహెద్ బాటు, మహమూద్, రవీందర్, రాజేందర్, రవి కుమార్, సుగుణాకర్, మధుకర్, రవికుమార్, తదితతరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి

కొడిమ్యాల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొడిమ్యాలలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ సోమవారం మండల బీజేపీ నాయకులు బండ నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయంలో ఆర్.ఐ కరుణాకర్‌కు వినతి పత్రం అందించారు. వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బండ నర్సింహరెడ్డి, జిల్లా నాయకులు చల్లా శ్రీనివాసరెడ్డి, వడ్లకొండ బుచ్చిరాములు, కొడిమ్యాల గ్రామ నాయకుడు ఏలలేటి నర్సింహరెడ్డి, నాయకులు ఇరుముల్ల శ్రీనివాస్ సాయిబాబా, శంకర్, గంగవర్దన్, అఖిల్, మహేందర్, తిరుపతి, అనిల్, అంజి ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

● డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ ● జిల్లావ్యాప్తంగా చిన్నారులకు మాత్రల పంపిణీ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ సాధ్యం అవుతుందని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జగిత్యాల పట్టణంలోని గొల్లపెల్లి రోడ్డులో గల మైనారిటీ గురుకుల పాఠశాలలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి చిత్రు నాయక్‌తో కలిసి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కారక్రమంలో ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, డిపిఓ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్



బీఆర్‌పూర్‌లో మాత్రలు వేస్తున్న ఎంఈవో

●కోరుట్ల: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణి చేశారు.

●కోరుట్ల రూరల్: అయిలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపీడీఓ రామకృష్ణ, మండల వైద్యాధికారి షమీనా తబసుమ్‌లు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అయిలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీఓ రామకృష్ణ, సమీనా తబసుమ్‌లు మాత్రను పంపిణీ చేశారు.

●మెట్‌పల్లి రూరల్: జగ్గసాగర్ గ్రామంలో మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి విద్యార్థులకు డాక్టర్ అల్బెండజోల్ మాత్రలు వేశారు.

●రాయికల్/బీర్‌పూర్/కథలాపూర్/మల్లాపూర్/వెల్గటూర్/కొడిమ్యాల/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం: రాయికల్ మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. రాయికల్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల వైద్యాధికారి సతీష్ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీపతి రాఘవులు పాల్గొన్నారు. బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగభూషణం పాల్గొన్నారు. కథలాపూర్ మండలంలో 5124 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్టు వైద్యాధికారిణి సింధూజ తెలిపారు. మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు ఆయా పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. వెల్గటూర్ పీహెచ్‌సీ వైద్యురాలు తేజశ్రీ, సీహెచ్‌వో జగన్నాథం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కొడిమ్యాల మండలంలో ఆల్బెండజోల్ మాత్రలు వైద్యుల నరేష్, పరమేశ్వరీ పంపిణీ చేశారు. పెగడపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్‌లో సోమవారం నులి పురుగు నివారణ మాత్రల పంపిణీని మండల వైద్యాధికారి నరేష్‌తో కలసి పెగడపల్లి మార్కెట్ చైర్మన్ రాములు గౌడ్ ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్ లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సలీం, మండల వైద్యధికారి హరీష్‌సి హెచ్ ఓ విజయభాస్కర్, ఏఎన్ఎంలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో హాజరుకు ఫేస్ రికగ్నిషన్

(ఐదో పేజీ తరువాయి)

ఒక వినూత్న చర్యగా అధికారులు భావిస్తున్నారు. ఈ విధానం హాజరు నమోదులో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, సాంకేతిక లోపాలను తగ్గిస్తుందని అభిప్రాయ పడుతున్నారు. ఈ కొత్త విధానం విజయవంతంగా అమలు కావాలంటే, సిబ్బంది, విద్యార్థులకు తగిన శిక్షణ, అవగాహణ కార్యక్రమాలు అవసరమవుతాయని యోచించి ఆ దిశగా ఇంటర్ బోర్డు చర్యలు తీసుకుంటోంది.

పారదర్శకత పెరుగుతుంది

-తిరుపతి రెడ్డి, లెక్చరర్, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల, జగిత్యాల



జూనియర్ కళాశాలల్లో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ అమలు అయినట్లయితే పారదర్శకత మరింత పెరుగుతుంది. అటెండెన్స్‌లో అవకతవకలు నివారించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇందుకు అవసరమైన వసతులు సమకూర్చాల్సిన అవసరముంది.

ప్రభుత్వ నిర్ణయం మేరకే...

-బొప్పరాతి నారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి



ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాము. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చినా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

కలెక్టరేట్‌కు చేరిన గ్రామాల సరిహద్దు వివాదం

●ప్రజావాణిలో రామన్నపేట, నూకపెల్లి గ్రామస్థుల పరస్పర ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రామన్నపేట, నూకపెల్లి గ్రామాల మధ్య కొన్ని సంవ్సరాలుగా సాగుతున్న వివాదం సోమవారం కలెక్టర్ కార్యాలయానికి చేరింది. ఐదు దశాబ్దాల క్రితం నూకపెల్లి నుంచి విడిపోయి రామన్నపేట గ్రామ పంచాయతీగా ఏర్పడింది. నూకపెల్లి గ్రామపంచాయతీ నుంచి 1978 అక్టోబర్ 16న రామన్నపేట గ్రామపంచాయతీని ఏర్పాటు చేస్తు అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పుడు రెండు గ్రామాలకు సర్వే నంబర్‌లు కేటాయించగా దాని ప్రకారం రామన్నపేట గ్రామపంచాయతీ పరిపాలన కొనసాగిస్తున్నది. కొన్ని రోజుల నుంచి రామన్నపేట గ్రామపంచాయతీకి కేయించిన సర్వే నంబర్‌లలో తమ గ్రామ పంచాయతీ ఇచ్చిన అనుమతులకు నూకపెల్లి గ్రామస్థులు అడ్డు పడుతున్నారని ఆరోపించారు.

తమ గ్రామానికి కేటాయించిన సర్వే నంబర్‌లలో మరొకరి జోక్యం లేకుండా చూడాలని రామన్నపేట వాసులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నంబర్‌ల గెజిట్ విడుదల చేసి వివాదం పరిష్కరించాలని నూకపెల్లి గ్రామస్థులు కలెక్టర్ సత్యప్రసాద్‌కు విన్నవించారు.

శివాలయాల్లో శ్రావణ మాస సందడి



కోటిలింగాల గోదావరి వద్ద భక్తుల పుణ్య స్నానాలు

వెల్గటూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సోమవారం సందర్భంగా మండలం లోని కోటిలింగాలకు భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గోదావరి ఒడ్డున గల గంగమ్మ తల్లికి పూజలు చేశారు. స్నాన ఘట్టాలపై ఇసుకతో శివ లింగాలు చేసి భక్తితో మొక్కి కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాదులు నిర్వహించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు భక్తులచే పూజలు చేయించారు. భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో కాంతారెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా పర్యవేక్షించారు.

●మల్లాపూర్: శ్రావణ మాసం సోమవారం సందర్భంగా పలు శివాలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. స్థానికులతో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు మల్లాపూర్ శివారున గల సోమేశ్వర కొండను కాలి నడకన ఎక్కి సహజ కోనేటిలో పవిత్ర స్నానంలు గావించారు. సోమేశ్వర స్వామి గల గర్భ గుడిలోకి వెళ్లి అభిషేకం, అర్చనలు, జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. గోదావరి తీర ప్రాంతాలు మొగిలిపేట మహాదేవాలయం, వాల్గొండ రామలింగేశ్వరాలయం, వివిరావుపేట గంగా గౌరీశ్వరాలయంలో పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంపై ఫిర్యాదు

రాయికల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, మురికి కాలువల నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని కలెక్టర్ సత్యప్రసాద్‌కు సోమవారం రాయికల్ మాజీ కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి వినతి పత్రం సమర్పించారు. రూ.82 లక్షల వ్యయంతో రాయికల్ పట్టణంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లు, మురికి కాలువలు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా నిర్మించారని పేర్కొన్నారు. పనులు ప్రతిపాదించిన ప్రాంతంలో సీసీ రోడ్డు, మురికి కాలువలు నిర్మించాల్సింది పోయి నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల్లో నిర్మిచారని అన్నారు. ప్రాజెక్ట్ డిజైన్, అనుమతులకు విరుద్ధంగా ఇష్టారీతిలో పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. రాయికల్ పట్టణంలో 2022 సంవత్సరంలో రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదని, కాంట్రాక్టర్ కెమెరాల ఏర్పాటులో అలసత్వం వహించాడని అన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

కొడిమ్యాల, ఆగస్టు 11 : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మండల కేంద్రంలో ముందస్తు కృష్ణాష్టమి వేడులకు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ నుండి అంగడి బజారు మీదుగా వేంకటేశ్వరస్వామి దేవస్థానం వారు శ్రీ కృష్ణ భగవానుని ఊరేగింపు వైభవంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో గురువు రాజా రాఘవదాస్ ప్రభుజీ, ఇస్కాన్ భక్త బృందం, ఆలయ పూజారి నాగరాజు రమేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజేశం, సభ్యులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ.. మహిళ మృతి

జగిత్యాలరూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ బస్టాండ్ సమీపంలోని నిజామాబాద్ రహదారిపై స్కూటీని లారీ ఢీకొన్న సంఘటనలో కొమ్ముల వజ్ర(48) అనే మహిళ మృతిచెందింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల పట్టణంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ కాలనీకి చెందిన కొమ్ముల వజ్ర సోమవారం రాయికల్‌లోని తమ బంధువుల పెళ్లికి వెళ్లింది. తిరిగి స్కూటీపై రాయికల్ నుంచి జగిత్యాలకు వస్తోంది. మార్గమధ్యలోని చల్‌గల్ బస్టాండ్ మూలమలుపు తిరుగుతున్న క్రమంలో కోరుట్ల వైపు నుంచి జగిత్యాల వైపు వస్తున్న లారీ స్కూటీని ఢీకొట్టగా వజ్రకు తీవ్రగాయాలయ్యాయి. వజ్రను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి సోదరుడు కొమ్ముల బుచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

ధర్మపురి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు సోమవారం ధర్మపురి కోర్టు మేజిస్ట్రేట్ జానకి జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు వ్యక్తుల్లో హాజీపూర్ మండలానికి చెందిన కారుకూరి శ్రావణ్‌కుమార్‌కు ఐదు రోజులు, ధర్మపురి మండలంలోని గాదెపల్లికి చెందిన వెలుగు ప్రేమ్‌సాగర్‌కు రెండు రోజులు, జైనా గ్రామానికి చెందిన సాయిని తిరుపతికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉదయ్‌కు మార్ మాట్లాడుతూ ఎవరైన వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

సత్ప్రవర్తనతో ఉండాలని తీర్పు

జగిత్యాల క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దాడి చేసిన కేసులో నలుగురు నిందితులకు ఒక సంవత్సరం పాటు బాలల పరిరక్షణ ప్రొబిషనర్ ఆఫీసర్ సూపర్ విజన్‌లో సత్ప్రవర్తనతో ఉండాలని పేర్కొంటూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ లావణ్య సోమవారం తీర్పు వెలువరించారు. బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తీగల ధర్మారం గ్రామానికి చెందిన గందం హరీష్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2019 ఆగస్టు 5న హరీష్ సోదరుడి కుమారుడైన దినేష్‌ను అతని స్నేహితులు సిరిపూర్ బ్రిడ్జి వద్ద దాడికి పాల్పడ్డారు. దినేష్ జరిగిన విషయాన్ని హరీష్‌కు తెలుపగా సంఘటన స్థలానికి చేరుకున్నాడు. హరీష్‌తో పాటు దినేష్‌పై ఎర్ర అక్షయ్, గడ్డం సాయి వంశీ, కత్తెర పాక రామకృష్ణ, తడక రవి అనే నలుగురు బండ రాళ్ల, కర్రలతో దాడికి పాల్పడ్డారు. హరీష్ ఫిర్యాదు మేరకు అప్పటి బీర్‌పూర్ పోలీసులు నలుగురుపై కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నలుగురు నిందితులు ఒక సంవత్సర కాలం ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ఉండేందుకు గాను బాలల పరిరక్షణ ప్రొబిషనర్ ఆఫీసర్ సూపర్ విజన్‌లో సత్ప్రవర్తనతో ఉండాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ప్రమాదవవత్తూ జారిపడి యువకుడి మృతి



మహేష్ (ఫైల్)

సారంగాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంబట్ల గ్రామంలో ప్రమాదవశాత్తు జారిపడి పల్లికొండ మహేష్ (40) అనే యువకుడు సోమవారం మృతి చెందాడు. స్థానికులు, ఎస్సై పి గీత తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణం పోచమ్మ వాడకు చెందిన పల్లికొండ మహేష్ అనే యువకుడు డిష్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పెంబట్ల గ్రామానికి చెందిన చొప్పరి రాజేందర్ ఇంటి రేకుల షెడ్డుపైన డిష్ కేబుల్‌ను సజ్జపై నిలబడి మరమ్మతు చేస్తున్నా డు. ఈ క్రమంలో ఇక్కసారిగా సజ్జ విరిగి కింద పడడంతో మహేష్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం అయింది. గమనించిన స్థానికులు, పోలీసులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు మహేష్ భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటోలు ఢీకొన్న ఘటనలో విద్యార్థులకు గాయాలు

సారంగాపూర్, ఆగస్టు, 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్పపల్లి ప్రభుత్వ పాఠశాల మూల మలుపు వద్ద రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుల్లపేట, అర్పపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులను ఆటోలో ఎక్కించుకుని రేచపల్లి ఓ ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అర్పపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద ఎదురుగా వస్తున్న మరో ఆటో అతివేగంగా విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆటో రోడ్డు పక్కన బోల్తా పడగా అందులో ఉన్న విద్యార్థి గంగాధర సిద్ధార్థకు ఎడమ చేయి, పాలెపు శివానికి కుడి చేయి విరిగింది. నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎస్సై గీత జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రంలో నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

జగిత్యాలరూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గూడులేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్రంలో నాలుగు లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతోందని మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాలరూరల్ మండలంలోని జాబితాపూర్, తిమ్మాపూర్, రఘురాములకోట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి మాజీమంత్రి జీవన్‌రెడ్డి భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, నాయకులు శ్రీరాముల గంగాధర్, స్వామిరెడ్డి, లక్ష్మణ్, మునీందర్‌రెడ్డి, లక్ష్మణ్, ధర్మన్న, రాజశేఖర్, మల్లేశం, రవీందర్, నర్సయ్య, గంగాధర్, సతీష్, వెంకటేష్, విజయ్, రాములు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజలో పాల్గొన్న మాజీమంత్రి జీవన్‌రెడ్డి

ధర్మపురి శివారులో చిరుత సంచారం లేదు

-ఎఫ్ఆర్‌వో శ్రీనాథ్

ధర్మపురి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి సంచరిస్తున్నది హైనా అని, చిరుత పులి కాదని ఎఫ్ఆర్‌వో శ్రీనాథ్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని అటవీ రేంజి కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మపురి శివారులో గల పోచం పంపు సమీపంలో గల వ్యవసాయ భూముల వద్ద చిరుత సంచరిస్తుందని గ్రామస్థులు తెలిపారని ఆయన అన్నారు. ధర్మపురి అటవీ శాఖ సిబ్బంది వెళ్లి చుట్టు పక్కల ప్రాంతాన్ని పరిశీలించగా వర్షం కారణంగా పాద ముద్రలు స్పష్టంగా అగుపించలేదన్నారు. వెంటనే పాద ముద్రల ఫొటోలు సేకరించి వాటిని వైల్డ్ లైఫ్ నిపుణులకు పంపించామని ఆయన అన్నారు. తిరిగి సోమవారం ఉదయం జిల్లా అటవీ శాఖ అధికారి రవిప్రసాద్, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. వైల్డ్ లైఫ్ నిపుణులతో విచారించి ఆ పాద ముద్రలు చిరుత పులివి కావని హైనాకు సంబంధించినవని నిర్ధారించామని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

పాలక మండలి సభ్యులను నియమించాలి

కొడిమ్యాల, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన వన, పశుసంవర్ధక శాఖ విశ్వవిద్యాలయాల్లో పాలక మండల్ల సభ్యుల నియామకం చేపట్టాలని సోమవారం వ్యవసాయ శాఖ మంత్రికి వినతి పత్రం పంపినట్లు పూడూర్ మాజీ సర్పంచు వెల్మల రాంరెడ్డి విలేకరులకు తెలిపారు. మూడు విశ్వవిద్యాలయాల్లో అనుభవం ఉన్న 12మంది రైతులను పాలక మండలి సభ్యులను నియామకం చేయాలని కోరారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక రైతుల అభివృద్ధికై అనుభవం ఉన్న రైతుల సలహాలు తీసుకోవాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేత

పెగడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలం వెంగళాయిపేట గ్రామానికి చెందిన మహ్మద్ మునీరా బేగం పేరిట మంజూరైన రూ. 2.50 లక్షలు ఎల్‌ఓసీని వారి కుమారుడు రెహ్మాన్‌కు మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. బాషుమియా సతీమణి మునీరా బేగం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరగా , ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్న ఆ కుటుంబం వైద్యం చేయించలేక కాంగ్రెస్ నాయకుల ద్వారా మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు విన్నవించారు. ఈ మేరకు రూ. 2.50 లక్షలు మంజూరు చేయించి సోమవారం మండల కాంగ్రెస్ నాయకుల ద్వారా ఆమె కుమారుడు

యూరియా కోసం బారులు తీరిన రైతులు



ఆత్మకూర్‌లో యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు సోమవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి గోదాం వద్దకు రైతులు తరలివచ్చి బారులు తీరారు. ఉదయం నుంచి క్యూలో పాసు బుక్కులు పెట్టితే గ్రామానికి చెందిన రైతు నిలబడలేక లైన్‌లో ట్రాక్టర్‌ను పెట్టాడు. మెట్లచిట్టాపూర్ సహకార సంఘం పరిధిలోని ఆత్మకూర్ గోదాం వద్ద 340 యూరియా సంచులతో కూడిన లారీ వచ్చిందని రైతులకు తెలియడంతో 400 మంది రైతులు తరలివచ్చారు. జూన్ నెల నుంచి ఒక్క సంచి తీసుకోని రైతులకు మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దీంతో క్యూలో ఉండలేక ట్రాక్టర్‌తో ఒక్క రైతు, పాసుబుక్కులు, ఆధార్‌కార్డులతో మరికొంత మంది రైతులు లైన్‌లో నిలబడగా 200 మందికి యూరియా దొరికింది. మిగతా రైతులు వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను అందించాలని కోరారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో వసతులు కల్పించాలి

జగిత్యాల క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో మౌళిక వసతులు కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు డిమాండ్ చేశారు. నూకపెల్లి అర్బన్ హౌజింగ్ కాలనీని సోమవారం మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతతో కలిసి విద్యాసాగర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ సమస్యలను వారికి వెళ్లబోసుకున్నారు. అనంతరం విద్యాసాగర్ రావు, వసంతలు మాట్లాడుతూ అర్బన్ హౌజింగ్ కాలనీలో గతంలో ఇళ్లు నిర్మించుకుని మధ్యలో నలిచిపోయిన నిర్మాణాలను ప్రభుత్వ ఇటీవల కూల్చివేసిందని తక్షణమే వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 4,500 ఇళ్లు మంజూరు చేస్తే కనీస వసతుల కల్పించక పోవడంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, శివకేసరి బాబు, దేవేందర్ నాయక్, శ్రీనివాస్, ఆనంద రావు, గంగాధర్, మహేష్, రిజ్వాన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు

●మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యూరియాపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కలిసి యూరియాపై క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టు 11 తేదీ రకు 23,300 మెట్రిక్ టన్నుల యూరియా అందించామని, ఇప్పటి వరకు 21060 మెట్రిక్ టన్నుల యూరియా సరసరా చేశామని మరో 2 వేలా మెట్రిక్ టన్నుల స్టాక్ పెట్టడం జరిగిందన్నారు. దేశంలో యూరియాకు కావాల్సిన ముడి సరుకు ఆలస్యం కారణంగా కొంత జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆధార్ కార్డు ద్వారా ఒక బస్తా పంపిణీ చేస్తామన్నారు.

ప్రజాపాలన ప్రభుత్వంలో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నా మని మంత్రి అడ్లూరి తెలిపారు. జిల్లా సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డిపై సోషల్ మీడియాలో వచ్చిన ట్రోల్‌పై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ఆటలతోనే మానసిక ఉల్లాసం కలుగుతోందని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఆటల పోటీలను జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్‌గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, బార్‌అసోసియేషన్ అధ్య క్షులు కంతి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, క్రీడా కార్యదర్శి బిగుల్లా శంకర్, సంయుక్త కార్యదర్శి గజేల్లి రాందాస్, ట్రెజరర్ పడిగేలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

గొల్లపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రైతు బీమా పథకానికి ఈనెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బొట్లకరుణ రైతులకు సూచించారు. సోమవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో ఆమె మాట్లాడుతూ రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశంను ప్రభుత్వం కల్పించిందని, జూన్5 2025లోపు పట్టాదారు పాసు పుస్తకాలు పొంది, 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సున్న రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోదల్చిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, రైతు, నామినీ ఆధార్‌కార్డులు దరఖాస్తు ఫారంతో పాటు జతపర్చి దరఖాస్తులు సమర్పించాలని రైతులకు సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని రెడ్ క్రాస్ బిల్డింగ్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం, పద్మాక్షి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరంలో 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు , సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ గుంటుక చంద్ర ప్రకాష్, రీజినల్ చైర్మన్ గుంటుక సురేష్ బాబు,జోన్ చైర్మన్ గంద్ర అజయేందర్ రావు, కార్యదర్శి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.